# మనిషిగా మారిన మనిషి

కందుకూరి వెంకట మహాలక్ష్మి



(పెద్ద కథ)

(గత సంచిక తరువాయి)

ఆరతి డాక్టర్ చేతుల్లోంచి తప్పించుకోడానికి పెనుగులాడసాగింది. ఎలా తప్పించుకోవాలో తెలీక ఏడుస్తూ బ్రతిమాలుతూ, తిడుతూ, అతన్ని గీరుతూ ఆ పట్టు విడిపించుకోడానికి శతవిధాల ప్రయత్నిస్తోంది. బెడ్‌రూంలోకి లాక్కెళ్ళి మంచం మీదకి తొయ్యగానే, లేని శక్తి కూడదీసుకుని కాలికొద్దీ అతని ఛాతీమీద తన్నింది. దాంతో వెనక్కిపడ్డ డాక్టర్ నెత్తిమీద పక్కనున్న టేబిల్ లైటుతో గట్టిగా కొట్టి జారిపోయిన పమిట సర్దుకుని, ఇంటి వైపుకి పరుగెట్టడం ప్రారంభించింది. ఇంటికి చేరిన ఆరతికి యింకా ఆయాసం, గుండెదడ తగ్గలేదు. కొంచెంసేపు అలాగే తలుపు తట్టకుండా గోడకి ఆనుకుని నిలబడి ఊపిరి తీసుకోసాగింది. తండ్రి గదిలోంచి వస్తున్న మాటలు స్పష్టంగానే వినపడుతున్నాయి.

"నాకు ముందు నుంచే అనుమానంగా వుంది నాన్నా! అది అర్ధరాత్రులు ఏదో వంకని బయటికి పోయి, ఎక్కడెక్కడో తిరిగి వస్తోంది.

లేకపోతే నీ పి.ఎఫ్. డబ్బు అయిపోయినా నా పురిటికీ, ఈ వైద్యానికీ డబ్బెలా యిచ్చిందంటావు? ఇల్లు ఎలా గడుపుతోంది?! అసలు ఉద్యోగం పోవడానికి కారణం కూడా యిలా అందరితో తిరగడం వల్లనేమో! తన పాచిక పారకపోయేసరికి ఆఫీసరే అల్లరి పెట్టేదని తిరగ బెట్టింది. నాకు మా వారితో తిరగడం తోటే ఈ అనుమానం కలిగింది. నిజంగా ప్రేమించిన ఆడదైతే నాకోసం ప్రేమించిన ప్రియుడిని త్యాగం చేసి వదులుకుంటుందా? మన పిచ్చిగానీ! మహా పతివ్రతలా మాట్లాడుతుందంతే! పైగా మనమంతా దాని మీదే ఆధారపడి వున్నామని దాని ఉద్దేశ్యం. మనకోసమే తన జీవితమంతా ధారపోస్తున్నానని భావిస్తోంది." అంటున్న భారతి మాటల్ని ఇంక వినలేక ఆరతి తలుపు తోసుకుని వెళ్ళి ఆవేశం పట్టలేక చెల్లెలి చెంపమీద ఛెళ్ళున కొట్టింది. అనుకోని ఈ సంఘటనకి తండ్రీ, భారతీ కంగారు పడిపోయారు. ఏడుస్తూ తండ్రి భుజం మీదకి వాలిన కూతుర్ని ఊరడిస్తూ "ఎందుకమ్మా ఆరతీ! దాని మీద చెయ్యి చేసుకుంటావు? అదన్న దాంట్లో తప్పేముంది? ఒక్కసారి అద్దం ముందుకెళ్ళి నీ ప్రతిబింబం చూసుకో, ఆదన్నమాట నిజమో కాదో నీకే తెలుస్తుంది. అదన్నట్లు దాని పురిటికి, ఈ వైద్యానికి డబ్బెక్కడినుంచి వచ్చింది? ఆఫీసర్ ఏదో అన్నాడని అబద్ధాలాడక పోతే, సాగర్‌తో తిరిగినట్లే ఆఫీసర్‌తోనూ తిరిగి పెళ్ళి చేసుకునుంటే ఈ సమస్య తీరిపోయేది కదా? ఎందుకీ దొడ్డి తోవ వ్యవహారం?" అంటూ తండ్రి నిలదీసి ప్రశ్నిస్తుంటే దుఃఖం ఆపుకోలేక గిర్రున తిరిగి వెళ్ళిపోయిందక్కడినుంచి.

"జరిగింది ఏమిటి? జరుగుతున్న దేమిటి? ఇంట్లో తండ్రీ, చెల్లెలే తన్ని అనుమానిస్తూ, "ఆఫీసర్ మాట వినుంటే గొడవుండేది కాదంటుంటే తనేం చెయ్యాలి? ఇందాకా జరిగింది తండ్రి, చెల్లెలికి చెప్పి గుండెల్లో బరువు దింపుకోవాలని పరుగు పరుగున వచ్చింది. వారు ఊరడిస్తుంటే గడిచిన గండాన్ని మర్చిపోయి ఉపశమనం పొందాలనుకుంది. కానీ వాళ్ళు తన్ని చూసి మరోలా భావించారు. తమ మాటలన్నీ నిజమైనట్లు తన రూపమే సాక్ష్యానిస్తోందన్నారు. ఇప్పుడు నిజాన్ని చెప్పినా నమ్మేదెవరు?! భగవాన్! నాకెందుకీ అందాన్నీ, యౌవనాన్ని యిచ్చావు? నా అందం, యౌవనమే నాకు శత్రువయి ప్రతీక్షణం హింసిస్తుంటే?! నేను చేసే ఏ పనినీ ఎవ్వరూ మెచ్చుటం లేదు. పైగా అపార్థాలు చేసుకుని నన్నే నిందిస్తున్నారు. ఛీ...ఛీ... ఎందుకీ పాడు బ్రతుకు! నా జీవితాన్నంతా ధారపోసి ఎంత చేస్తున్నా తనకి గుర్తింపు లేదు. గాజులు తాకట్టుపెట్టి ఆ డబ్బు ఇలా వాడినట్లు చెప్తే బాధపడతారని ఇంట్లో చెప్పలేదు. కానీ వాళ్ళు దాన్నెంత అపార్థం చేసుకున్నారు! తనెవరితోటో గడిపి తెస్తున్న సొమ్ము అని చెల్లెలన్న మాటలు గుర్తొస్తేనే అసహ్యంతో వళ్ళంతా కంపరం పుడుతోంది. సాగర్‌తో తిరిగినట్లు మేనేజర్ తోటీ తిరిగితే అతను పెళ్ళాడేవాడని తండ్రన్న మాటలు గుర్తొస్తే తండ్రిమీద అసహ్యం పుడుతోంది. సాగర్‌కి, మేనేజర్‌కి పోలికేమిటి? సాగర్‌లోవున్న ఒక్క సుగుణం మేనేజర్‌లో వుందా? ఆ మాటంటే నమ్ముతారా? పైగా వంద పెడర్థాలు తీస్తారు. మేనేజర్‌కి భార్యగా వుండి అతను రోజుకొకరితో తిరుగుతుంటే సహించి బ్రతకగలనా? అయినా అతను నన్ను పెళ్ళాడతాడనేమిటి? రోజుకొకత్తి కావాలని అంటారతన్ని. నాన్న ఆ మాటలనే ముందు మేనేజర్‌తో నా జీవితమెంత హాయిగా వుంటుందని ఆలోచించారా?" అంటూ ఆలోచించ సాగింది ఆరతి. 'జీవితమంతా ఎదురు దెబ్బలే' అనుకుంది.


❋ ❋ ❋

సాయంత్రం ఏడు గంటలు దాటింది. ఎండవేడి తగ్గి చల్లటి గాలి వీస్తోంది. ఆరతి తెల్లటి చీరకట్టి, తలనిండా మల్లెపూలు పెట్టుకుని దేవకన్యలా తయారయింది. రిక్షా దిగి డోర్‌బెల్ నొక్కింది. మేనేజరే స్వయంగా తలుపు తియ్యడం ఎదురుగా నిలబడ్డ ఆరతిని చూస్తూ తన్మయత్వంతో రెండు నిమిషాలు అలాగే నిలబడిపోయి ఆమెనే చూడసాగాడు.

రెప్పవాల్చకుండా తన్నే చూస్తున్న మేనేజర్‌వైపు చూస్తూ "సార్! లోపలికి రావచ్చా?" అంది చిరునవ్వుతో ఆరతి.

వెర్రివాడిలా ఆరతి అందాలని ఆస్వాదిస్తూ

## కుక్కకాటుకు చెప్పుదెబ్బ



ఇది నిజంగా జరిగిన సంఘటన. అమెరికాలో చార్లెట్ అనే లాయర్ పొగాకు ప్రియుడు. ఒకసారి చాలా అరుదైన, ఖరీదయిన పొగాకు చుట్టల (సిగార్స్) పెట్టె ఒకటి కొన్నాడట. వెంటనే దానిని అగ్నిప్రమాద పరిహార రక్షణ క్రింద ఒక పెద్ద బీమా కంపెనీలో ఇన్సూర్ చేశాడట. ఒక నెలలోనే పెట్టెలోని చుట్టలన్నీ తాగేసి, ఇంకా ఒక్క ప్రీమియం కూడా కట్టకుండానే చార్లెట్ బీమా కంపెనీ మీద క్లైమ్ పెట్టాడట. తన చుట్టలన్నీ వరుసగా చిన్న చిన్న అగ్నిప్రమాదాలకి గురి అయి కాలిపోయాయని లాయర్ చెప్పేది నిజం కాదనీ, చుట్టలన్నీ ఆయన మామూలుగా వెలిగించి తాగి అనుభవించినందునే పెట్టె ఖాళీ అయిందని చెప్పిన బీమా కంపెనీ వాదనతో ఏకీభవిస్తున్నప్పటికీ, కోర్టులో జడ్జిగారు ఒక టెక్నికల్ అభ్యంతరాన్ని గుర్తించారు. అదేమంటే తీసుకున్న పాలసీలో వేటిని అగ్నిప్రమాదంగా గుర్తించాలి? అన్న విషయం స్పష్టంగా లేకపోవటం. ఈ అభ్యంతరం దృష్ట్యా బీమా కంపెనీ లాయర్‌కి 15 వేల డాలర్లు నష్టపరిహారంగా చెల్లించాలని జడ్జి తీర్పు చెప్పారు. ఇక కోర్టుల చుట్టూ తిరగటం ఇష్టంలేకనేమో బీమా కంపెనీ తీర్పు ప్రకారం లాయర్‌కి డబ్బు చెల్లించింది.

కథ ఇంతటితో ముగియలేదు. లాయర్ తనకు అందిన చెక్ క్యాష్ చేసుకున్నాడో లేదో బీమా కంపెనీ వెంటనే ఆయన మీద కేసు పెట్టింది. ఆయన కోర్టులో ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం తనే కావాలని చుట్టలకి నిప్పంటించి బీమా చేసిన సంపదని దగ్ధం చేశాడని, అందుకని దీన్ని తగలబెట్టడం (ఆర్సన్) నేరం కింద పరిగణించి అతనికి శిక్ష విధించాలని వారు వాదించారు. ఈ సారి కేసు విన్న జడ్జి లాయర్ చార్లెట్‌ని దోషిగా గమనించి అతని మీద 24 వేల డాలర్ల జరిమానా, 24 నెలల కారాగార శిక్ష విధించారట. మొత్తం మీద కుక్కకాటుకు చెప్పుదెబ్బలా సాగిందిది.

**– వి.కె. మోహన్**

నిలబడ్డ మేనేజర్ ఆమె మాటలతో ఈ లోకంలోకొచ్చి ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుని లోపలికి తీసుకెళ్ళి సోఫాలో కూర్చోపెట్టి తనూ పక్కగా కూర్చున్నాడు.

"ఏమిటింత దయకలిగింది నీకు! నేనెవరి ముఖం చూసి లేచానీవేళ! నా అదృష్టాన్ని ఎలా కొనియాడుకోవాలి!" అంటూ ఆమెకి మరి కొంచెం దగ్గరగా జరిగాడు.

ఆరతి అతన్ని అభ్యంతరపెట్టలేదు. శరీరంలో చిన్న వణుకులాంటిది పుట్టుకొస్తోంది. నెమ్మదిగా అదురుతున్న పెదాలు తెరిచి "సార్! చిన్న మనవి".

"ఛ...ఛ...మనవేమిటీ? నీకేం కావాలో చెప్పు! క్షణాల మీద యిస్తా. నువ్వు అడగాలే గానీ కాదంటానా?" అంటూ వికారంగా నవ్వుతున్న మేనేజర్ ముందు చేతులు జోడించి "నా ఉద్యోగం నాకిప్పించండి సార్! మా కుటుంబానికి అదే ఆధారం" అంది.

"అది నీ చేతులారా నువ్వే పోగొట్టుకున్నావు. నేనేం పీకేశానా? ఆ రోజే నువ్విలా నా మాట వినుంటే నీకు ప్రమోషన్ కూడా వచ్చి వుండేది" అంటూ ఆమె భుజం చుట్టూ చెయ్యేసాడు.

"సార్! మరో మనవి. మీరు నన్ను భార్యగా స్వీకరించండి. నేను మిమ్మల్ని పెళ్ళి చేసుకుని మీ నీడని పడుంటాను. సార్! నన్ను పెళ్ళి చేసుకోమని అడగడానికే నేనివాళ వచ్చాను. మీ యిప్పటి జీవితానికి, మీ విలాసాలకి ఎప్పుడూ అడ్డురాను. మీ భార్యనన్న మాంగళ్యాన్ని నా మెడలో వేసి, నాకు మీరు తోడుగా వున్నారన్న ధైర్యాన్ని, ఒక నీడని ప్రసాదించండి. ఈ మాటలు చెప్పాలనే మీ దగ్గరకు వచ్చాను సార్! నీతిగా బ్రతకాలనుకున్న నాలాంటి దానికి ఇంటా, బయటా కూడా చోటులేదని తెలిసింది. మీకు నేను కావాలి. ఇప్పుడు కాదు ఎప్పుడు కావాలన్నా మీ దగ్గరే వుంటాను. అలా అని మీ పాత జీవితానికి అడ్డురాను. మీ యింట నాకో మూల చోటు ఇవ్వమని కోరుతున్నాను" అంటూ మేనేజర్ చేతుల్ని పట్టుకు బ్రతిమాలుతున్న ఆరతివైపు హాస్యంగా చూస్తూ "ఏమిటీ! నిన్ను పెళ్ళాడాలా?! ఇన్నేళ్ళుగా హాయిగా, స్వేచ్ఛగా బ్రతుకుతున్న నన్ను కటకటాల్లో బంధించి సంసారమనే మురికి కూపంలోకి తొయ్యడానికా? ముందంతా నీలాగే కబుర్లు చెప్పి, హాయిగా విహరించే మమ్మల్ని పంజరంలో రెక్కలు విరిచి బంధిస్తారీ భార్యలు. నా కల్లో కూడా నేనా జీవితాన్ని కోరుకోను. నువ్వు చేసింది తప్పని తెలుసుకున్నావు. నీకు మళ్ళీ ఆ ఉద్యోగం కావాలనుకుంటే నా మాట విను. నీ ఉద్యోగం నీకు లభిస్తుంది. లేదా నీ ఇష్టం" అంటూనే ఆమెని దగ్గరికి లాక్కున్నాడు.

అంతే – ఆరతి ఉక్కిరి బిక్కిరయిపోయింది. ఊపిరి సలపటంలేదు. నిస్సహాయంగా అతనికి లొంగిపోతోంది. అభ్యంతరం చెప్పలేకపోతోంది. మాట రావటం లేదు. పెనుగులాడటం లేదు. మనసు అంగీకరించటం లేదు. శరీరం లొంగిపోతోంది. "నాశనమయిపోతున్నాను, నేనేం చేస్తున్నాను. ఏ బలహీనత నన్నిలా చేయించింది? బీదరికం వల్లే!! అనుకున్నది సాధించలేకపోవడం వల్ల నన్ను నేనిలా శిక్షించుకుంటున్నానా?? ఒక కిరాతకుడి వలలో కావాలని పడ్డాను. ఇంక తప్పించుకోలేను. అసహాయత నన్నీ పరిస్థితికి దింపింది. నా మీద నాకే అసహ్యం పుడుతోంది. కంపరంగా వుంది. వళ్ళంతా తేళ్ళూ, పాములూ పాకుతున్నట్లుంది." నిస్సహాయంగా అతని ఒడిలోకి వాలిపోయింది.

అతనికవేం పట్టడం లేదు. పేరుగాంచిన విటుడిగా తన కామాన్నంతా కసిగా ఆమె మీద తీర్చుకుంటున్నాడు. ఒకసారి కాదు. ఆమె ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండా తృప్తితీరా ఆమె యౌవ్వనంతో ఆటలాడుకున్నాడు. ఆకలి తీరిన పులిలా శరీరం చల్లార్చుకుని, "మర్నా

## మీకు తెలుసా?

మలయాళ నటుడు, హీరో ప్రేమ నజీర్ 85 హీరోయిన్ల సరసన నటించాడు. కథానాయికి షీలాతోనే వంద చిత్రాల్లో నటించాడు.


❋ వి. శాంతారామ్, మనవడు పండిట్ జస్‌రాజ్ కుమారుడైన, సారంగదేవ్ తన 13 వ ఏటనే సంగీత దర్శకత్వం వహించాడు.

❋ సురేఖా యాదవ్ భారతీయ రైల్వే మొట్టమొదటి మహిళా డ్రైవర్‌గా పని చేసింది.

❋ తన 94 వ ఏట డా॥ ఎం.ఎల్. కతోటియా, మెడిసిన్‌లో పి.హెచ్.డి. చేశారు.

❋ లీలాసేథ్ మొట్టమొదటి మహిళా చీఫ్ జస్టిస్‌గా (హిమాచలప్రదేశ్) రికార్డు నెలకొల్పింది.

❋ లతాపటేల్ ఇంగ్లాండులోని మొట్టమొదటి ఆసియన్ మేయర్‌గా ఎన్నికయ్యారు.



డొచ్చి ఆఫీసులో చేర”మని చెప్పి పంపేశాడు.

ఒళ్ళంతా నొప్పులుగా, బరువుగా వుంది. భారంగా లేచి బైటికొచ్చి టైము చూసుకుంది. రాత్రి పన్నెండు కావస్తోంది. ఇంతరాత్రి ఇంటికెలా వెళ్ళడమని ఆలోచిస్తూ గేటు తెరిచి అటూ, ఇటూ చూడసాగింది. దూరంగా ఒక రిక్షావాడు వస్తున్నాడు. అతడిని ఆపి రిక్షా ఎక్కి తని ఇంటికి వెళ్తున్న ఆరతి మస్తిష్కంలో ఇప్పుడే ఆలోచనలూ లేవు. “ఇంక తను ఒకరి కోసం యంత్రంలా బ్రతకాలి. నాకు ఎవ్వరూ లేరు. నేను సర్వనాశనమైపోయాను. ఇంట్లో వాళ్ళ కోసం అన్నీ సహించాలి” అనుకుంది నిర్లిప్తంగా.

ఇంటి దగ్గర దిగి రిక్షా డబ్బులిస్తున్న ఆరతి ముఖంలోకి ముఖంపెట్టి చూసిన రిక్షా అతను “నువ్వా తల్లీ! ఆనాడు నిన్నేదో అన్యాయం చేస్తాడని లోపలికి రమ్మంటే వచ్చి అనవసరంగా ఆ మారాజుని తిట్టి, కొట్టి నిన్ను రక్షించానని సంబరపడ్డాను. అయితే ఆ బాబు తప్పేంలేదన్న మాట! ఆనాడు నిన్ను అప్పగించమని ఆ పోలీసోడు అడిగితే కాదన్న దానికి ఫలితంగా నా మీదో కేసు మోపి మూణ్ణెల్లు జైలుకి కూడా పంపేడు తల్లీ! ఇలాంటి సానిదానివని తెలిసివుంటే కోరి ఆ ఆపద తెచ్చుకుండేవాడిని కాదు. నా భార్యా, బిడ్డల్ని మాడ్చుకున్నా, నీకుపకారం చేసానని ఆనందించాను. చాలు, చాలు తల్లీ! నీవల్ల చాలా పాట్లు పడ్డాను. నీ డబ్బు తీసికెళ్ళి నా పిల్లలకి పెడితే విషమౌతుంది. తిండికి లేకపోయినా ఫరవాలేదుగానీ సానిబేరాలొద్దు తల్లీ! నీలాంటి నీచులం కాము తల్లీ! పేదోళ్ళమయినా మాలో నీతుందమ్మా! పెద్ద పెద్ద కులాల్లో పుట్టి ఎందుకీ దొంగ గడ్డి తల్లీ! చదువుకున్నోళ్ళు ఏ ఉద్యోగమో చేసుకుని బతకరాదూ? ఏం బుద్ధి! భోగంవాళ్ళు వృత్తి మానేస్తే, సంసారులంతా సాన్లయిపోయారు. ఛీ...థూ” అని కాండ్రించి ఉమ్మేసి ఆరతి ఇచ్చిన డబ్బులు తీసుకోకుండా వెళ్ళిపోతున్న రిక్షా వాడిని చూస్తూ శిలలా నిలబడిపోయింది ఆరతి.

అతని మాటలు ఆరతి గుండెల్ని చీల్చేస్తున్నాయి. దుఃఖం సముద్రపు కెరటాల్లా పొంగుకొస్తోంది.

“భగవాన్! ఏది తప్పు, ఏది ఒప్పు! అసలు తప్పెవరిదీ? నాన్నదా? నాదా? నాకు అందాన్నీ, యౌవ్వనాన్నీ యిచ్చిన నీదా? అధికారం వున్న ఆఫీసర్దా? తప్పు చేసినా తప్పే, ఒప్పు చేసినా తప్పే అయింది నా బ్రతుకంతా. ఎందుకు నన్నీ ఇంటికి పెద్దపిల్లగా పుట్టించావు? ఆ రిక్షావాడి కూతురిగానన్నా పుట్టించివుంటే నా కలలన్నీ కన్నీళ్ళయ్యేవి కావు కదా? వాలాంటి ఆడదానిగా మరెవర్నీ పుట్టించకు తండ్రీ! అసలు “ఆడది” అంటేనే అందరికీ లోకువ. లోకం ఎంత మారినా నావంటి వారి జీవితాల్లో మార్పురాదు పైగా ఇలా నాశనం కావలసిందే, అసలు తప్పెవరిదీ కాదు. ఆడపుట్టుక పుట్టడమే పెద్ద తప్పు” అనుకుంటూ కన్నీటి పొరల మధ్య నీడలా ఆనుతున్న రిక్షా అతనికి రెండు చేతులూ జోడించి నమస్కరించింది ఆరతి.

లోపలికి అడుగెట్టబోయిన ఆరతి ఎవరో అడ్డుకున్నట్లు ఆగిపోయింది. చెప్పలేని బాధ మనసుని పిండేస్తోంది. ఇన్నేళ్ళుగా అందరూ ఆడిన మాటలు ఒక ఎత్తు రిక్షా అతను ఆడిన మాటలు ఒక ఎత్తు అయి దుఃఖం, అవమానం ఒక్కసారిగా గుండెల్లోంచి తన్నుకొచ్చాయి. ఆఫీసరు తన శరీరాన్నే హింసించాడు కానీ రిక్షా అతను ములుకుల్లాంటి మాటలతో తను చేసిన తప్పుని ఎత్తి చూపి బుద్ధి చెప్పాడు. ఏదో నిర్ణయించుకున్నట్లు ఇంటి వెనకవైపుకి నడిచింది.

❄ ❄ ❄

ఆరతి ఆత్మహత్య చేసుకోవాలన్న ప్రయత్నంతో డాబాపై నుంచి దూకి క్రిందపడి స్పృహ కోల్పోయిందని, చేతి, కాలి ఎముకలు విరిగాయని మర్నాడు ఆరతి ఆఫీసులో కూడా తెలియడంతో తోటి ఉద్యోగస్తులు, పైవాళ్ళూ కూడా ఆస్పత్రికి వెళ్ళి ఆమెని చూసి వస్తున్నారు.

మేనేజర్ చెవికి సోకిన ఈ మాటలు ఎందుకో తిన్నగా హృదయానికే తగిలి కాస్త కలవర పెట్టసాగాయి. ఆ కలవరంలో ఏదో బాధ! “నీ వల్లే ఇలా జరిగింది”ని అతని మనసు చెప్పసాగింది. దానికి తోడు ఆరతిని చూసొచ్చిన వారంతా ఆమె గాయాలని, ఆమె ఇంటి పరిస్థితిని వర్ణిస్తుంటే ఏదో తప్పు చేసానన్న భావం అతనిలో కలిగి బాధించసాగింది.

ఆరతిని వెళ్ళి పలకరించే ధైర్యం చాలటం

## ఆడవాళ్ళూ మీకు జోహార్లు

కాకాని కమల

### మహిళా తేజం

ఏదన్నా ఒక రంగంలో కీర్తి ప్రతిష్టలు ఆర్జించటం సహజం. కాని తనది కాని రంగాల్లో కూడా కాలూని స్త్రీలు రాణిస్తున్న రోజులివి. ఇందుకు కేవలం సినిమా గ్లామర్ ఒక్కటే కారణం అంటే అది సరికాదు. ఎందుకంటే ఎన్.టి. రామారావు, కృష్ణంరాజు, ఎం.జి.ఆర్ వంటి ఎందరో ప్రముఖులు రాజకీయ రంగంలో కూడా ప్రజల చేత నీరాజనాలు అందుకున్నారు. అయితే స్త్రీలు మాత్రం ఏం తక్కువని? వైజయంతిమాల, బి. సరోజాదేవి వంటి వారు కూడా రాజకీయ రంగంలో రాణించారు. ఇప్పుడు ఆ కోవలోనే



డ్రీమ్ గరల్ హేమమాలిని రాజ్యసభ సభ్యురాలిగా ప్రమాణ స్వీకారం చేశారు. తన 56 వ పుట్టిన రోజు సందర్భంగా హేమామాలిని ఎం.పి.గా బాధ్యతలు స్వీకరించి తన జీవితంలో మరో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టింది.

తన ఛాంబర్లో చైర్మన్ షెకావత్ హేమామాలిని చేత ప్రమాణ స్వీకారం చేయించారు! సెహబాష్ హేమా. ❄

లేదు. కానీ ఏమూలో దాగివున్న సంస్కారం "వెళ్ళి చూసి రావడం నీ ధర్మం" అని చెప్తోంది. ఆస్పత్రికెళ్ళే సాహసంలేని మేనేజర్ ఆఫీసవగానే ఆరతి ఇంటికి బయలుదేరాడు.

తలుపు చప్పుడికి "ఎవరూ?" అంటూ ప్రశ్నించిన ఆరతి తండ్రి లోపలికి వస్తున్న వ్యక్తిని "ఎవరు కావాలి బాబూ!" అంటూ కనుబొమలు ముడిచి చూసాడు.

అరవైయ్యేళ్ళు దాటిన వ్యక్తి అయినప్పటికీ అనారోగ్యం వల్ల డెబ్భైయేళ్ళు పైబడ్డ వ్యక్తిలా మంచానికి అంటిపెట్టుకుపోయి వుండడం చూసిన మేనేజరు "నేనండీ! మీ అమ్మాయి ఆఫీసులో పనిచేస్తున్నాను" అంటూ గోపాలం గారి పక్కనున్న కర్రకుర్చీ లాక్కుని కూర్చుని, చేతిలో వున్న పళ్ళని పక్కన పెట్టాడు.

ఆరతి గురించి అడుగుతున్న మేనేజర్‌కి సమాధానం చెప్తూనే "బాబూ! నువ్వు, నువ్వు శేఖరంగారి అబ్బాయి వాసువి కదూ?" అని అడిగిన ప్రశ్నకి, గోపాలంగారి ముఖం ఎక్కడో చూసినట్లు, ఆయన గొంతు ఎప్పుడో విన్నట్లు అనిపించసాగిందే గానీ గుర్తుకి మాత్రం రావటం లేదు మేనేజర్‌కి.

మళ్ళీ గోపాలంగారే "నేను బాబూ! గోపాలాన్ని. నన్ను కర్నూలు బదిలీ చేసినప్పుడు పిల్లల చదువులు పాడవుతాయని నేనొక్కడినే కర్నూలుకొచ్చి, మీ ఇంట్లోనే ఓ గదిలో అద్దెకుండే వాడిని నాయనా! మీ నాన్నగారు చాలా ఉత్తముడు. నువ్వప్పుడు చిన్నవాడివి. చదువులో చాలా చురుకుగావున్నా కాలేజీలో అమ్మాయిల్ని ఏడిపించడంలో కూడా అంతే చురుకు" అంటూ నవ్వుతూ ఆప్యాయంగా చెయ్యి నిమిరిన గోపాలంగారిని చూస్తూ గతంలోకి వెళ్ళిపోయాడు మేనేజర్ వాసుదేవరావు.

తమ ఇంటి మేడమీద ఓ గదిలో అద్దెకుండే గోపాలంగారు ఈయనేనా? తనకి రోజూ రాత్రుళ్ళు అర్థంకాని పాఠాలని చెప్పే వ్యక్తి ఈయనేనా? చిన్నప్పటినుంచి ఆకతాయిగా, అల్లరిగా పెరిగిన తను ఓసారి తండ్రిచ్చిన డబ్బు జులాయిగా ఖర్చుచేసి ఫీజు కట్టకపోయే సరికి నోటీసొచ్చింది. తండ్రికి తెలిస్తే చంపుతాడన్న భయంతో "అంకుల్!" అంటూ వెళ్ళి గోపాలంగారితో చెప్పగానే ఆయన ఎన్నో నీతి వాక్యాలనీ బోధించి, మరెప్పుడూ అలా చెయ్యొద్దని చెప్పి, పిల్లల చదువుల కోసం తల్లిదండ్రులు ఎన్ని ఇబ్బందుల్ని ఎదుర్కొని చెప్పిస్తారో చెప్పి ఫీజు డబ్బు ఫైన్‌తో సహా ఇచ్చాడు. ఆనాడాయన ఆ డబ్బిచ్చి వుండకపోతే?? ఆర్థికపరంగా కూడా మళ్ళీ ఆ డబ్బు ఇవ్వగల స్థోమత తండ్రికి లేదు. తన చదువు అంతటితో ఆగిపోయేది.


ఆ తరువాత అలాంటి చిన్న పెద్ద ప్రమాదాలనుంచి తన్ని గోపాలంగారు ఎన్నోసార్లు కాపాడారు. ఆ గోపాలంగారు ఈరోజు పక్షవాతంతో మంచం పట్టి వున్నారా? ఆయన కూతురేనా ఆరతి?! ఎవరి వల్లనయితే ఆనాడు కాలేజీ చదువు పూర్తి చెయ్యగలిగానో ఆయన కూతురి పట్లే తనింత నీచంగా ప్రవర్తించి హింసించాడా? ఏ గోపాలంగారు ఫీజు కట్టబట్టి తనింతటి ఆఫీసరయ్యాడో ఆ గోపాలంగారి కుటుంబాన్నే తిండిలేకుండా నడిరోడ్డుమీద నిలబెట్టడానికి తయారయ్యాడా? అన్న ఆలోచన రాగానే మనసంతా వికలమై అక్కడ ఒక్క క్షణం కూడా నిలవలేక "వస్తానండీ!" అంటూ లేచి తిన్నగా ఆరతిని చేర్పించిన ఆసుపత్రికి వెళ్ళి, ఆమెకి మంచి వైద్యం జరగాలని, త్వరగా కోలుకొనేలా చూడమని దానికయ్యే ఖర్చు తాను భరిస్తానని పెద్ద డాక్టర్‌లకి, పై అధికారులకి చెప్పి ఆరతి వున్న వార్డులోకి వెళ్ళాడు.

కాలికి, చేతికి ప్లాస్టర్లు వేసి వున్నాయి. అక్కడక్కడ కముకు దెబ్బలతో తెల్లటి చర్మం నల్లబడివుంది. అందమైన ఆరతి ఆ స్థితిలో మంచంమీద దీనంగా, స్పృహలేకుండా పడివుండటం చూసిన మేనేజర్ మనసు బాధ, సిగ్గుతో చితికిపోయింది.

ప్రాణభయంలేదని డాక్టర్ చెప్పిన మాటలకి తృప్తిగా ఊపిరి పీల్చుకుని ఆరతి పక్కన కూర్చుని ఆమె చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు. "నన్ను పెళ్ళి చేసుకోండి సార్!" అని దీనంగా వేడుకున్న ఆరతి కోర్కెని తీర్చాలి". ఆరతి నాది – ఆమె ఇంటి బాధ్యతలు ఈనాటి లగాయతు నావే!!" అన్న నిర్ణయానికొచ్చిన మేనేజర్ వాసు ఆప్యాయంగా ఆరతి చేతిని తన చేతిలోకి తీసుకుని నిమిరాడు. అలా నిమిరింది కామంతో కాదు. హృదయం నిండా నిండిన అనురాగం, ఆప్యాయతలతో! పశ్చాత్తాపంతో కుమిలిపోతున్న మనసుతో!!

ఇన్నేళ్ళుగా కామంతో కప్పబడిన తన కంటిలోని పొరల్ని చీల్చుకుని ఒక మనిషిగా ఆసుపత్రినుంచి బైటికి వచ్చాడు మేనేజర్ వాసు.

**(అయిపోయింది)**



## సిమ్రాన్ గర్భవతి!

దక్షిణాదిన ఓ ఊపు ఊపి, విమర్శకుల ఊహలను పటాపంచలు చేస్తూ చిన్ననాటి స్నేహితుడిని పెళ్ళాడిన సిమ్రాన్ ఇప్పుడు ఓ బిడ్డకు తల్లవబోతోంది. ఈ సమయంలోనే రెండు తమిళ సినిమాలకు సిమ్రాన్ ఒప్పందం కుదుర్చుకోవడం విశేషం! ఇప్పుడామెకు నాలుగో నెలని ఆమె స్నేహితులు చెబుతున్నారు. సిమ్రాన్ గర్భవతయినప్పటికీ తమ సినిమాలో నటించడానికి ఎటువంటి ఆటంకాలు ఎదురు కావని తమిళ నిర్మాతలు చెబుతున్నారు.